క్లుప్తంగా

23 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగరలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: నిండు గర్భిణుల సంరక్షకులకు కాన్పు, తల్లీ బిడ్డల సంరక్షణపై అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా అంగర పీహెచ్‌సీలో సోమవారం 23 మంది గర్భిణులను పరీక్షించారు. వారిలో హైరిస్క్ కేసులుగా ముగ్గురిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం నివేదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడమే గాకుండా, సంపూర్ణ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే సుఖ ప్రసవానికి అవకాశం కలుగుతుందన్నారు. కపిలేశ్వరపురానికి చెందిన జుత్తుగ వెంకన్న చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జుత్తుగ మల్లికార్జునుడు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఈ బి.రామారావు, స్టాఫ్ నర్సు జె.బంగారుపాప, ఎంఎల్‌హెచ్‌పీ, ల్యాబ్ టెక్నీషియన్, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో గర్భిణులు ఆయా గ్రామాల్లోని ఏఎన్ఎంల ద్వారా పేరు నమోదు చేయించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకోవాలని ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సందీప్‌నాయుడు సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో సోమవారం 31 మంది గర్భిణులను పరీక్షలు చేశారు. వారిలో 9 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించి, వారిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణపై విచారణ



పసలపూడిలో విచారణ చేస్తున్న పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాస్

రాయవరం: పసలపూడి పంచాయతీలో 2014 నుంచి జరిగిన నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై పంచాయతీ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆదేశాల ప్రకారం మండపేట మండల ఈవోపీఆర్అండ్ఆర్‌డీ శ్రీనివాస్ ఇరువురు సెక్రటరీలతో కలిసి విచారణ చేపట్టారు. త్వరలో విచారణ పూర్తి చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. విచారణలో పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజులు, ఫిర్యాదుదారుడు చింతా తమ్మిరెడ్డి పాల్గొన్నారు.

15న గణిత పోటీల విజేతలకు బహుమతులు

రామచంద్రపురం: గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ ఇటీవల నిర్వహించిన గణిత పోటీల్లో జాతీయ స్థాయి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విజేతల వివరాలను వెబ్ సైట్‌లో ఉంచినట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, అకాడమీ సెక్రటరీ ఎం.నాగార్జున, ఎగ్జామ్స్ సెల్ నిర్వాహకులు, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కే శ్రీకృష్ణసాయి ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలైన విద్యార్థులు ఈనెల 15వ తేదీన ఉదయం 9 గంటల 30 నిమిషాలకు రామానుజన్ గణిత అకాడమీలో జరిగే వార్షికోత్సవ సభలో పాల్గొనాలని వారు కోరారు.

మానవత్వంతో వ్యవహరించాలి



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ తాతారావు

కపిలేశ్వరపురం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల మానసిక స్థితిగతుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఐఈఆర్టీలు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, ఎంఈఓ కె.తాతారావు, ఉద్యోగుల సంఘం మండపేట జోన్ అధ్యక్షుడు జిత్తుగ మల్లికార్జునుడు మాట్లాడారు. మానసిక సమస్యలతో మాధపడుతున్న చిన్నారులకు భవిత కేంద్రం సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కట్టా మురళి, చింతా పెద్దకాపు, కమ్మ వెంకట్రావు, బలుసు జానికి రామయ్య పాల్గొన్నారు.

రబీకి అన్నదాతలు సన్నద్ధం

- నెలాఖరుకు పూర్తి చేయాలంటున్న వ్యవసాయ శాఖ
- రెండు నియోజకవర్గాల్లో 120 గ్రామాల్లో సాగు



వరినాట్లు వేసేందుకు దమ్ము చేసి పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతులు

రాయవరం: ఖరీఫ్ పంట దాదాపు ఒబ్బిడైంది. అలుపెరగని శ్రామికులైన అన్నదాతలు ఇప్పుడు రబీ సాగుపై దృష్టి సారించారు. వాతావరణం కూడా అనుకూలించడంతో రైతులు వేగంగా రబీ వరిసాగు చేపడుతున్నారు. వ్యవసాయ శాఖ కూడా డిసెంబరు నెలాఖరులోగా వరినాట్లు పూర్తి చేయాలని రైతులకు సూచిస్తోంది. ఈ ఏడాది రబీ పనులను ముందుగానే రైతులు ప్రారంభించారు. ఇప్పటికే బోర్లపై సాగు చేసే చోట రైతులు వరినాట్లు పూర్తి చేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో రబీ వరిసాగును రైతులు చేపడుతున్నారు.

1.01 లక్షల ఎకరాల్లో వరిసాగు

క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేస్తున్నారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో రబీ వరినాట్లు ఊపందుకుంటున్నాయి. అధిక శాతం రైతులు ఎంటీయూ 3626(బొండాలు) రకాన్ని సాగు చేస్తుండగా, బొండాలతో పాటుగా 1001, 1010, 1121, 1156, నెల్లూరు సన్నాలు తదితర రకాలను సాగు చేస్తున్నారు. అధిక శాతం రైతులు బొండాలు సాగుకే మొగ్గు చూపుతున్నారు.

వెదజల్లుకు ప్రాధాన్యం

ఇదిలా ఉంటే సాధారణ పద్ధతిలో వరినాట్లు వేసుకోవడం కన్నా వెదజల్లు సాగుకే ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వెదజల్లు విధానంలో సాగు చేయడం వలన సమయం ఆదా కావడమే కాకుండా దుబ్బు చేసుకుని తెగుళ్లను తట్టుకుంటుందని, ముఖ్యంగా సమయం ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ చెబుతుంది. రబీలో వెదజల్లు పద్ధతిలో వరి నాట్లు వేసుకుంటే దిగుబడిలో కూడా మంచి ఫలితం వస్తుంది. పలువురు రైతులు తొలకరిలో కూడా అధిక శాతం విస్తీర్ణంలో వెదజల్లు విధానంలో సాగు చేశారు. సాధారణ పద్ధతిలో వరినాట్లకే ప్రాధాన్యమిస్తున్న రైతులు వరి నారు మడులను సిద్ధం చేసుకున్నారు. వెదజల్లు సాగులో మూడసార్లు కలుపు మందు వేయాల్సి వస్తుందని, దీనివల్ల భూసారం దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వెదజల్లు వలన ఖరీఫ్‌లో చేలో మిగిలి ఉన్న వరి గింజలు మొలకెత్తి కేళీలుగా వస్తున్నాయని, సాధారణ పద్ధతిలో వరినాట్లు వేసుకుంటే కేళీల ఇబ్బంది ఉండదని కొందరు రైతులు చెబుతున్నారు. అయితే వ్యవసాయశాఖ మాత్రం వెదజల్లుకే ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు.

రబీ పనులు ప్రారంభించాం



ముందస్తు రబీ పనులను ప్రారంభించాం. రబీ ముందుగా సాగు చేస్తే అపరాల సాగుకు అవకాశం ఉంటుంది. వెదజల్లు విధానంలో సాగుకు ప్రాధాన్యమిస్తున్నాం. దీని వలన సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.

– కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కౌలు రైతు, పసలపూడి, రాయవరం మండలం

మురగడ దమ్ము చేయాలి



వెదజల్లు సాగు చేసే రైతులు సాలుకు సాలుకు మధ్య వారంరోజులు గడువు ఉంచాలి. దీని వలన ఖరీఫ్‌లో చేలో మిగిలిన పాత విత్తనాలు మొలకెత్తి రెండో దమ్ములో మట్టిలో కలిసే అవకాశం ఉంది. దీని వల్ల కేళీని నియంత్రించవచ్చు.

– కొప్పిసెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం.

అనుమతి లేని రెస్టారెంట్ సీజ్



టేకిలో రెస్టారెంట్ వద్ద ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న తనిఖీ అధికారులు

కపిలేశ్వరపురం: టేకి గ్రామంలోని శ్రీ గణపతి రెస్టారెంట్‌ను పంచాయతీ అధికారులు సీజ్ చేశారు. గత నెల 17 నుంచి ఈ రెస్టారెంట్ నడుస్తోంది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు కార్యదర్శి కె.రామకృష్ణ, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, బి.వెంకటేశ్వరరావు, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి సోమవారం రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. నిర్వాహకుడు గంటి గణపతి ఎలాంటి అనుమతులు చూపించకపోవడంతో సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ మాంసాన్ని గుర్తించి నమూనాలను సేకరించారు. నిల్వ మాంసాన్ని దూర ప్రాంతంలో పూడ్చిపెట్టారు. తనిఖీల్లో ఎంఎల్‌హెచ్‌పీ జి.శ్రీను, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ రెస్టారెంట్, హోటళ్లను నిర్వహించుకోదలచినవారు పంచాయతీ తదితర శాఖల అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. అనుమతి ఉన్న హోటళ్లలో సైతం ఆహార పదార్థాల్లో నాణ్యత కొరవడితే చర్యలు తప్పవన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత కేంద్రంలోని చిన్నారులకు బహుమతులు అందిస్తున్న కన్వీనర్ సత్యనారాయణ తదితరులు

కె.గంగవరం: దివ్యాంగులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా భవిత కన్వీనర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలోని భవిత కేంద్రాంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని భవిత కేంద్రాల్లో పిల్లలకు రవాణా ఖర్చు సహాయాన్ని ఇప్పటికే అందించామన్నారు. భవితా కేంద్రాల వద్ద నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని వారి ద్వారా దివ్యాంగులకు మంచి చదువు, పౌష్టికాహారం అందుతుందన్నారు. అనంతరం చిన్నారులకు దాతల ద్వారా వచ్చిన బహుమతులను అందించారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఐఆర్టీ కేంద్ర నిర్వాహకులు సత్యనారాయణ, సౌభాగ్య లక్ష్మీ, మన గంగవరం సేవా సంస్థ సభ్యులు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, కుందూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో లూథరన్ చర్చి ప్రతిష్ఠోత్సవం



నూతన ఆలయాన్ని ప్రారంభిస్తున్న రెవరెండ్ శామ్యూల్

మండపేట: కేశవరం గ్రామంలో నిర్మించిన ట్రినిటీ లూథరన్ చర్చి ప్రతిష్ఠోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గోదావరి సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ అక్కాబత్తుల శామ్యూల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రెవరెండ్ డాక్టర్ సీహెచ్ మాణిక్యాలరావు, వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఆర్ విజయకుమార్, రెవరెండ్ కె. విశ్వేశ్వరరావు, రెవరెండ్ వారా శామ్యూల్, రెవరెండ్ డానియేల్ పాల్గొని చర్చి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం నూతన ఆలయాన్ని బిషప్ అక్కాబత్తుల శామ్యూల్ రిబ్బన్ కట్ చేసి ఆలయ ప్రవేశం చేశారు. సంఘకాపరి రెవరెండ్ నూతనపాటి డేవిడ్‌పాల్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘస్తులు, సంఘ సేవకులు, లూథరన్ చర్చి మండల కాపరులు, ఆయా సంఘాల కాపరులు పాల్గొన్నారు. సంఘ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రేమ విందు జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మాజీ సర్పంచ్ దూలం ఆనందరావు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు), ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, గ్రామస్తులు, సండే స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

సామాజిక సేవకులు చిరస్మరణీయులు

కమ్యూనిస్టు నేత జిత్తుగ వెంకన్న 22వ వర్ధంతిలో వక్తలు



కపిలేశ్వరపురంలో జిత్తుక వెంకన్న జ్ఞాపకార్థం చిన్నారులకు పెన్నులు అందజేస్తున్న అతిథులు

కపిలేశ్వరపురం: సామాజిక సేవలందించిన ప్రజా నాయకులు ఎల్లప్పుడు సామాన్యుల గుండెల్లో నిలిచిపోతారని కపిలేశ్వరపురానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు జిత్తుగ వెంకన్న 22వ వర్ధంతిలో పాల్గొన్న వక్తలు అన్నారు. అంగర, కపిలేశ్వరపురంలలో సోమవారం జుత్తుగ వెంకన్న చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జుత్తుగ మల్లికార్జునుడు ఆధ్వర్యంలో వెంకన్న వర్ధంతి నిర్వహించారు. అతిథులు సర్పంచ్ సాకా శ్రీనివాస్, జిత్తుక చిన వీర్రాజు, ఎంపీటీసీ సభ్యురాలు గొల్లపల్లి సోనియా, సామాజిక కార్యకర్త పెద్దింశెట్టి లెనిన్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా మురళి మాట్లాడుతూ రామచంద్రపురం పూర్వపు తాలూకా పరిధిలో కమ్యూనిస్టు ఉద్యమం సాగిన తీరును వివరించారు. సామాన్యులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్ధిని సమకూర్చేందుకు వెంకన్న తీవ్రమైన పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం భవిత కేంద్రంలో చిన్నారులకు విద్యా ఉపకరణాలు, పండ్లు పంపిణీ చేశారు. చిన్నారులకు భోజన సదుపాయం కల్పించారు. మాచర గ్రామంలో 40 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. అంగర పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహార ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జుత్తుక వెంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ పర్మినెంట్, కాంట్రాక్ట్ వర్కర్స్ ధర్నా



రామచంద్రపురంలో ధర్నా చేస్తున్న కార్మికులు



మండపేటలో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

రామచంద్రపురం: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచేందుకు గత ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్‌ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ పర్మినెంట్, కాంట్రాక్ట్ వర్కర్స్ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నాను నిర్వహించారు. అనంతరం కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు బండి సత్యనారాయణ, సెక్రటరీ జి.రాజు, పెద్దిరెడ్డి రాము తదితరులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు ఎన్కేస్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీలో సమస్యలను వివరిస్తూ పుష్ కార్టులు పూర్తిగా దెబ్బ తినడం వల్ల కొత్త పుష్ కార్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రోజువారీ హాజరు సచివాలయాల వద్ద కాకుండా ఇన్‌స్పెక్టర్ సమక్షంలో తీసుకోవాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. సమస్యలపై స్పందించి కమిషనర్ వెంటనే అమలు జరిగే లాగా చూస్తానని కార్మికులకు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు, మాచర రావు, సంపర సుధా, ముత్యాల సుజాత, వడ్డాది రాజు, దివిలి రవి, గూడుపు నూకరాజు తదితర కార్మికులు పాల్గొన్నారు.

మండపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెకు దిగారు. రాష్ట్ర ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె చేపట్టారు. కార్యాలయం ఎదురుగా టెంట్ ఏర్పాటు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాన్ని ప్రారంభించాలి



ఆర్అండ్‌బీ ఈఈకి సమస్యను వివరిస్తున్న శంకర నారాయణ

కాజులూరు: అసంపూర్తి పనులతో నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణాన్ని పునః ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణమూర్తి అన్నారు. సోమవారం కాకినాడలో జిల్లా రహదారులు, భవనాల శాఖ ఎగ్జికూటివ్ ఇంజినీర్ రమేష్‌కుమార్‌ను శంకర నారాయణమూర్తి తదితర నాయకులు కలుసుకుని సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం శంకరనారాయణమూర్తి మాట్లాడుతూ సుమారు రూ.36 కోట్ల వ్యయంతో గొల్లపాలెం-కుయ్యేరుల రహదారి పనులను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సుమారు 13 కిలోమీటర్ల ఉన్న ఈ రోడ్డులో పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు ముందుకు సాగడంలేదన్నారు. బిల్లులు పెండింగ్ కారణంగా కాంట్రాక్టరు పనులు నిలిపివేశారని, వెంటనే వాటిని క్లియర్ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఈఈ రమేష్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు.

పీఎంఏవై దరఖాస్తుకు 15 వరకూ గడువు

- మున్సిపల్ కమిషనర్ రంగారావు
- పథకం అమలుపై అధికారులతో సమీక్ష



పథకంపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

మండపేట: మునిసిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలం ఉండి సొంతిల్లు నిర్మించుకోదలచిన వారు హౌసింగ్ రుణాల కోసం ఈ నెల 15 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 ద్వారా ఇలాంటి వారికి రుణాలు మంజూరవుతాయని ఆయన చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, సఫాయి కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లకు కూడా ఈ పథకం గృహ నిర్మాణ సాయం అందుతుందన్నారు. పట్టణ ప్రాంతాల వారికి గృహనిర్మాణ రుణాల మంజూరుపై కమిషనర్ సోమవారం మునిసిపల్ కార్యాలయంలోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. టౌన్ హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్ మూర్తి, టీపీవో ఎ.శ్రీధర్, మున్సిపల్ ఏఈ పవన్‌కుమార్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ పథకానికి ప్రభుత్వ మార్గదర్శకాలను కమిషనర్ వివరించారు. దరఖాస్తు చేసుకొనే లబ్ధిదారులు ఆయా వార్డు సచివాలయాలకు వెళ్లి లబ్ధిదారుని స్థలం దస్తావేజులు, రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంటు పాసుపుస్తకాలు జతపరిచి ఇవ్వాలన్నారు. తీసుకున్న గృహ రుణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీగా ఇస్తాయన్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసం చేయలేరు



గొల్లపాలెంలో పెద్దింశెట్టి అన్నవరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లు మాటలు చెబుతూ ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గొల్లపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దింశెట్టి అన్నవరం, మతుకుమిల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ యువజన విభాగ నాయకుడు లంక కేశవస్వామి కుటుంబ సభ్యులను సోమవారం సూర్యప్రకాశ్ తదితర నాయకులు పరామర్శించి సానుభూతిని తెలిపారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజా సమస్యలపై చర్చించారు. తప్పుడు వాగ్ధానాలు చేసి గద్దెనెక్కిన టీడీపీ నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసి జొన్నకూటి వెంకటేశ్వర్రావు, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, పార్టీ నాయకులు చొల్లంగి వెంకన్న, పెంకే స్వామి, మాదిరెడ్డి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు అప్రోచ్ నిర్మించాలి



అప్రోచ్ లేక ప్రమాదకరంగా మారిన వంతెన

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గ్రామంలో పంటకు సుమారు ఐదేళ్ల క్రితం నాబార్డు నిధులతో నూతన వంతెనను నిర్మించారు. అయితే అప్పట్లో నాసిరకం కంకర వాడడం వల్ల కొంత వరకు అప్రోచ్ కొట్టుకుపోయింది. మిగిలిన సగం ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాలువలోనికి పోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని సర్పంచ్ చిట్టూరి వెంకటరామయ్య అంటున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు అప్రోచ్ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రాయవరం: రెవెన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దారు ఐ.పి.శెట్టి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 10న లొల్ల, 11న చెల్లూరు, 12న నదురుబాద, 13న సోమేశ్వరం,16న కురకాళ్లపల్లి, 17న మాచవరం, 18న పసలపూడి, 19న వెంటూరు, 20న వెదురుపాక, 21న కూర్మాపురంలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు వివరించారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు సోమావరం తెలిపారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాలపై సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. 10న టేకి గ్రామ సచివాలయంలోనూ, 11న వల్లూరు, 12న నేలటూరు, 13న కాలేరు, 16న నిడసనమెట్ట వడ్లమూరు, 18న వెదురుమూడి, నల్లూరు 19న వాకతిప్ప, 20న అంగర, 21న కోరుమిల్లి, 23న కపిలేశ్వరపురం, 24న తాతపూడి, 26న మాచర, 27 పడమర ఖండ్రిక, 28న అద్దంకివారిలంక, 30న కేదారిలంక గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నారు. మాచరలో రైతు సేవా కేంద్రంలోనూ మిగిలిన అన్ని గ్రామాల్లోనూ సచివాలయాల్లోనూ సదస్సులను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

మండపేట మండలంలో..

మండపేట: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మంగళవారం నుంచి మండలంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు మండపేట తహసీల్దారు తేజేశ్వరరావు సోమవారం తెలిపారు. 10న మారేడుబాక పంచాయతీ కార్యాలయం, చిన ద్వారపూడి రామాలయం వద్ద, 12న వెలగతోడు, మెర్నిపాడు గ్రామాల్లోను, 17న ఇప్పనపాడు, పాలతోడు గ్రామాల్లోను, 19న ద్వారపూడి, జెడ్. మేడపాడు పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. అలాగే మండపేట పట్టణానికి సంబంధించి 21న ఎంపీడీవో కార్యాలయంలో సదస్సు జరుగుతుందన్నారు. 24న అర్తమూరు, 27న తాపేశ్వరం, 31న ఏడిద పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభలు జరుగుతాయన్నారు. జనవరి 2న ద్వారపూడి శివారు వేములపల్లి గ్రామ సచివాలయంలోను, 4న కేశవరంలో గ్రామసభలు నిర్వహిస్తారన్నారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని మంగళవారం నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకూ రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించనున్నట్టు మండల తహసీల్దార్ ఎం.సావిత్రి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సదస్సుల ద్వారా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం అంబికపల్లి అగ్రహారం, బుధవారం యనమదల, 12న నరసాపురపుపేట, 13న ఓదూరు, 16న చోడవరం, 17న ఏరుపల్లి, ఉట్రుమిల్లిలో సదస్సులు నిర్వహించనున్నారు. 19న జగన్నాయకులపాలెం, 20న వెల్ల, 21న తాడిపల్లి, 23న కాపవరం, 24న కందులపాలెం, 26న ఉండూరు, 27న భీమక్రోసుపాలెం, 28న హసన్‌బాద, 30న తోటపేట, జనవరి 2న ద్రాక్షారామ, 3న వెలంపాలెం, 4న నెలపర్తిపాడు, 6న వెంకటాయపాలెం, 7న వేగాయమ్మపేట, 8న రామచంద్రపురం, ముచ్చుమిల్లి గ్రామాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతులు, ప్రజలు తమ భూ సమస్యలను సదస్సులను సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలని కోరారు.

దొరగారిపాలెంలో వసతులు కల్పించాలి

కాజులూరు: కనీస వసతులు కల్పించాలని తణుకువాడ శివారు దొరగారిపాలెం గ్రామస్తులు అధికారులను కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యుడు డొప్పా బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, మంచినీరు సరఫరా, రహదారుల సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. శలపాక, మంజేరు రహదారి నుంచి గ్రామంలోనికి వచ్చేందుకు కోరంగి కెనాల్‌పై నిర్మించిన కాలిబాట వంతెనకు ఇరువైపులా అప్రోచ్ నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అప్రోచ్‌ను స్థానికులు ఏర్పాటు చేసినా మట్టి జారిపోవడంతో వాహనదారులు తరచూ పడిపోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఈ శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407